




మానుకోటలో ఆర్డీవో అలివేలుకు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నోటీసును అందజేస్తున్న ఎంపీటీసీలు (ఫైల్)

పదవులకు గండం!



బీఆర్‌ఎస్‌కు అసమ్మతి సెగ

- మానుకోట, గార్ల ఎంపీపీలపై అవిశ్వాస నోటీసులు
- మునిసిపల్ వైస్‌చైర్మన్‌పైనా రంగం సిద్ధం
- ఇప్పటికే రాజీనామా చేసిన శివాజీ చౌహాన్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 6 : 'గులాబీ' నేతల్లో గుబులు మొదలైంది. ఎప్పుడు ఎవరు అవిశ్వాసానికి నోటీసు ఇస్తారో తెలియని పరిస్థితి నెకొంది. ప్రజాప్రతినిధుల్లో ఎవరి పదవికి ఎసరు వస్తుందోననే ఆందోళనలు మొదలయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే బీఆర్‌ఎస్ అవిశ్వాస సెగ తగిలింది. 'కారు' పార్టీకి చెందిన ఎంపీపీలు, మునిసిపల్ చైర్మన్‌లపై అవిశ్వాసాలు పెడుతూ, వారిని గద్దె దించుతున్నారు. కొన్నిచోట్ల అవిశ్వాసాలు నెగ్గుతుండగా.. మరి కొన్నింట్లో వీగిపోతున్నాయి. భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) జడ్పీ చైర్మన్, ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్‌లపై ఎప్పటి నుంచో అవిశ్వాసం పెట్టాలని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మునిసిపల్ కౌన్సిలర్లు భావిస్తున్నారు. అయితే పంచాయతీరాజ్ మునిసిపల్ చట్టాల ప్రకారం పదవీ చేపట్టిన నాటి నుంచి నాలుగేళ్ల పూర్తయ్యాక అవిశ్వాసం పెట్టాలనే నిబంధనలుండడంతో ఇంతకాలం ఆగుతూ వచ్చారు. ఇప్పుడు నాలుగు సంవత్సరాలు పూర్తికావడంతో పాటు రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో అవిశ్వాసాలకు సమయం ఆసన్నమైంది.

మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న అవిశ్వాస సెగ ఇటీవల మానుకోట జిల్లాను కూడా తాకింది. ఇప్పటికే మహబూబాబాద్, గార్ల మండలాల బీఆర్‌ఎస్ ఎంపీపీలపై అక్కడి ఎంపీటీసీలు మానుకోట ఆర్డీవోకు అవిశ్వాస నోటీసులు అందించారు. ఈ క్రమంలో గార్ల ఎంపీపీ మూడు శివాజీచౌహాన్ రాజీనామా చేసి, పదవి నుంచి తప్పుకున్నారు. ఇక బీఆర్‌ఎస్ ప్రాతినిధ్య మహబూబాబాద్ మునిసిపాలిటీ వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు సిద్ధమైనట్లు సమాచారం. ఈ అవిశ్వాసాలు నెగ్గితే మరికొన్ని మండలాలు, మునిసిపాలిటీల్లో కూడా పెట్టే అవకాశం లేకపోలేదన్న చర్చ జరుగుతోంది.

ఆర్డీవోలకు అవిశ్వాసంపై దరఖాస్తులు..

మహబూబాబాద్, గార్ల మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ ఎంపీపీలపై అవిశ్వాసానికి ఆయా మండలాల ఎంపీటీసీలు ఆర్డీవోకు అవిశ్వాసంపై దరఖాస్తులు చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం కావడంతో అందరి దృష్టి ఇక్కడ ఉండడంతో అవిశ్వాస అంశం హాట్ టాపిక్‌గా మారింది. మహబూబాబాద్ మండలంలో 13 మంది ఎంపీటీసీలుండగా అందులో 5 బీఆర్‌ఎస్, 6 కాంగ్రెస్, ఒకటి టీడీపీ, ఒకటి స్వతంత్ర అభ్యర్థి గెలుచుకున్నారు. స్వతంత్ర, టీడీపీతో కలిసి బీఆర్‌ఎస్ ఎంపీపీని కైవసం చేసుకోగా, బీఆర్‌ఎస్ ప్రాతినిధ్య భవాండ్లపల్లి లక్ష్మీపురం ఎంపీటీసీ భూక్య మౌనిక ఎంపీపీ అయ్యారు. ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీల్లో కంబాలపల్లిపల్లి ఎంపీటీసీ తన పదవికి రాజీనామా చేయడంతో మిగిలిన 12 మంది సభ్యుల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు చెందిన 9 మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాసం పెడుతున్నట్లు మానుకోట ఆర్డీవో అలివేలుకు గతనెల 25వ తేదీన దరఖాస్తును అందజేశారు. మరోపక్క ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని గార్ల మండలంలో 11 ఎంపీటీసీలుండగా అందులో ఆరు బీఆర్‌ఎస్, రెండు కాంగ్రెస్, రెండు స్వతంత్రులు, ఒక్కటి సీపీఐ గెలుచుకుంది. మెజార్టీ స్థానాలు గెలిచిన బీఆర్‌ఎస్ ఎంపీపీని కైవసం చేసుకోగా.. మర్రిగూడెం ఎంపీటీసీ మూడు శివాజీచౌహాన్ పదవి దక్కించుకున్నారు. ఆయనపై 9 మంది ఎంపీటీసీలు కలిసి అవిశ్వాసం పెడుతున్నట్లు మానుకోట ఆర్డీవోకు గతనెల 22వ తేదీన నోటీస్‌ను ఇవ్వగా, మరునాడు శివాజీ చౌహాన్ గార్ల ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు.

ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద మునిసిపాలిటీ..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అతిపెద్ద మునిసిపాలిటీ మానుకోట వైస్ చైర్మన్ ఎమ్డీ. ఫరీద్‌పై అవిశ్వాసానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. మహబూబాబాద్ మునిసిపాలిటీలో 36 వార్డులుండగా, అందులో అత్యధిక స్థానాలు గెలుచుకున్న బీఆర్‌ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కైవసం చేసుకుంది. స్థానిక మునిసిపాలిటీలో 36 వార్డులుండగా అందులో ఒకవార్డు కౌన్సిలర్ హత్యకు గురయ్యాడు. మిగిలిన 35 వార్డుల్లో 22 మంది బీఆర్‌ఎస్‌కు సభ్యులుండగా.. 9 మంది కాంగ్రెస్, ఇద్దరు సీపీఐ, ఇద్దరు సీపీఎం వార్డు కౌన్సిలర్లు ఉన్నారు. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు 14 మంది సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. అయితే అవిశ్వాసం పెట్టేందుకు వార్డు కౌన్సిలర్లలో 50 శాతం మంది సభ్యులు సంతకాలు పెట్టాల్సి ఉంటుంది. అంటే ఇంకా నలుగురి కౌన్సిలర్ల మద్దతు అవసరం ఉంది. నలుగురు కలిసి వస్తే వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ఇది ఇలా ఉండగా డోర్నకల్ నియోజకవర్గ పరిధిలోని మరిపెడ మునిసిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు అక్కడి కౌన్సిలర్లు సిద్ధమవుతుండగా ఆ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కీలక నేత రంగ ప్రవేశం చేసి అసమ్మతి కౌన్సిలర్లతో మాట్లాడడంతో వారు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికి మహబూబాబాద్ జిల్లాలో అవిశ్వాసల సెగతో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల్లో వణుకుపుడుతోంది.

త్వరలో వరంగల్‌కు సీఎం రేవంత్



హనుమకొండ సిటీ, జనవరి 6 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో వరంగల్ నగరంలో పర్యటించనున్నారు. అసెంబ్లీ సమావేశాల తరువాత ఆయన రానున్నట్లు తెలిసింది. పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇటీవలే 'కుడా'లో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి కొండా సురేఖ సూత్రప్రాయంగా రేవంత్‌రెడ్డి పర్యటనను వెల్లడించారు. త్వరలోనే ఆయనను నగరానికి తీసుకు వచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ వర్గాల్లో కూడా రేవంత్ పర్యటన అంశం చర్చలో ఉంది. మేడారం జాతర.. ఆపై లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ ప్రకటన కాక ముందే రేవంత్‌రెడ్డిని వరంగల్ నగరానికి తీసుకురావాలనే యోచనలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇందుకు అనుగుణంగా మేడారం జాతరకు ముందే తీసుకువచ్చి అభివృద్ధి పనులను ప్రారంభింప చేయడం సరైనదిగా భావిస్తున్నారు.

ప్లాస్టిక్‌ను స్వచ్ఛందంగా నిషేధించాలి

- మానుకోట మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి



మునిసిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 6 : ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అవరోధాలున్నాయని, ప్రజలు దానిని స్వచ్ఛందంగా నిషేధించాలని మానుకోట మునిసిపల్ చైర్మన్ పాల్వాయిరాంమోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ప్లాస్టిక్ నిషేధంపై పట్టణ వ్యాపారస్తులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ తయారీలో ఉపయోగించే రసాయనాలతో పర్యావరణ సమస్యలు తలెత్తి, వాతావరణంలో సమతుల్యత లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి, పర్యావరణ అనుకూల జనపనార, బయోడీ గ్రేబుల్ సంచులు మాత్రమే వాడాలని కోరారు. నాన్‌వెజ్ విక్రయించే వ్యాపారస్థులు వినియోగదారులు టిఫిన్ బాక్సులు తెచ్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి ప్లాస్టిక్ రహిత మానుకోట తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రసన్నారాణి, శానిటరి ఇన్స్‌పెక్టర్లు దండె శ్రీహరి, రాజేష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు



- మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్
- ఈనెల 18 నుంచి బస్సులు నడిపిస్తాం..
- వరంగల్ రీజియన్‌లో 2,500 బస్సులు
- రాష్ట్ర వ్యాప్తంగా 41.. రీజియన్ పరిధిలో 17 పాయింట్లు
- బస్సుల నిర్వహణకు 15వేల మంది సిబ్బంది కేటాయింపు
- 'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత

7

మహిళలపై దాడులను అరికట్టాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ రవిగుప్తా



హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రవిగుప్తా

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : తెలంగాణ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డీజీపీ రవిగుప్తా సూచించారు. హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ జిల్లా ఎస్పీతో మంగళవారం వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా డిసెంబర్ నెలలో మొత్తం నేర పరిశోధన గ్రేవ్, క్రైమ్, ఇన్విస్టిగేషన్, ప్రాసిక్యూషన్, మహిళలపై నేరం, పోక్సో చట్టం కేసులు, ఎస్సీ, ఎస్టీ, ఎన్డీపీఎస్ చట్టం కేసులు, ఫంక్షన ల్స్, వర్టికల్స్, సైబర్‌క్రైమ్‌పై సమీక్షించారు. ఈ సందర్భం గా రవిగుప్తా మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమీక్షలో మహబూబాబాద్ నుంచి ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ, సీసీఎస్ డీఎస్పీ మోహన్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సైబర్ క్రైమ్ డీఎస్పీ శ్రీనివాస్, ఐటీసెల్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ వ్యాఖ్యలపై నిరసనలు

- సీఎంకు మాజీ ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్
- రేవంత్‌రెడ్డిని అవమానిస్తే కార్యకర్తలు ఊరుకోరు : కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్





ఇనుగుర్తిలో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ శ్రేణులు



డోర్నకల్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 6 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అవమానపరుస్తూ వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కేంద్ర మాజీమంత్రి పోరిక బలరాంనాయక్ డిమాండ్ చేశారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సుమన్‌ను ప్రేరిపిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వ్యవహారశైలిని నిరసిస్తూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూసెంటర్‌లో మంగళవారం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిని అవమానిస్తే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చూస్తూ ఊరుకోబోరని హెచ్చరించారు. బాల్క సుమన్ ఒక్కచెప్పు చూపిస్తే.. హస్తం పార్టీ శ్రేణులు అతడికి రిటర్న్‌గిఫ్ట్ ఇస్తారని స్పష్టం చేశారు. ఇటువంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య మాట్లాడుతూ దొరలకు బానిసైన బాల్క సుమన్ బానిస సుమన్‌గా మారారని ఆరోపించారు. అటువంటి వ్యక్తి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అర్థరహితమన్నారు. అనంతరం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సుమన్‌పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, నీరుటి లక్ష్మీనారాయణ, గుగులోతు వెంకట్, బానోత్ ప్రసాద్, రవినాయక్, ఎడ్ల రమేష్, నిమ్మల శ్రీను, శంతన్ రామరాజు, రాందాసు, వీరేందర్, గునిగంటి కమాలకర్, ఉపేందర్, యుగేందర్, శంకర్, రంజిత్, సుదర్శన్, విజయలక్ష్మి, రియాజ్ అన్సారీ, వీరన్న, నాసర్, నరేష్‌రెడ్డి, శ్రీను, నజీర్ పాల్గొన్నారు.

- రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ చేసిన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, సీఎంకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి భూక్య బాలునాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ తొత్తుగా వ్యవహరించే సుమన్‌కు సీఎంను విమర్శించే స్థాయి ఉందా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ట్రైబల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దరావత్ సురేష్‌నాయక్, బానోత్ విష్ణు, వేణు, సొమ్ముచౌహాన్, మోతీలాల్, నవీన్‌రెడ్డి, నర్సింహారావు, లింగయ్య పాల్గొన్నారు.
- ఇనుగుర్తిలో మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మురళీనాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి ఇలా సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోబోమని, వంద చెప్పులతో ఆయనకు సమాధానం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, కేసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, ఇనుగుర్తి పట్టణాధ్యక్షుడు గంజి రాజేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చిన్నాల కట్టయ్య, నాయకులు గుజ్జనూరి బాబురావు, రజినీకుమార్, భట్టు శ్రీను, బైరు అశోక్ గౌడ్, కొట్టం మహేందర్, మామిడి జనార్దన్ పాల్గొన్నారు.
- డోర్నకల్ గాంధీ సెంటర్‌లో పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎల్లావుల హరికృష్ణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుశీల్‌కుమార్‌జైన్, సాదనాల వెంకటేశ్వర్లు, రెడ్డబోయిన శంకర్, బాస్కర్, శ్రీనునాయక్, అప్పారావు, కోటి, యాకేష్, విజయ్, లక్ష్మణ్‌నాయక్, వెంకట్‌నాయక్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



మేడారంలోని సమ్మక్క ఆలయం

మహా జాతరకు నేడు అంకురార్పణ

మేడారంలో గుడిమెలిగే పండుగకు సర్వం సిద్ధం

మేడారం, ఫిబ్రవరి 6: మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు బుధవారం అంకురార్పణ జరగనుంది. ప్రధానమైన గుడిమెలిగే పండగను వడ్డెలు (పూజారులు) నిర్వహించనుండగా.. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఉదయం మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ, కొండాయిలోని గోవిందరాజులు, పూనుగొండ్లలోని పగిడిద్దరాజుల ఆలయాల్లో వడ్డెలు సంప్రదాయ పూజలు చేసిన తర్వాత ఆలయాలను శుద్ధి చేయనున్నారు. తర్వాత దూపదీప నైవేద్యాలను సమర్పిస్తారు. వేకువజామున పూజారులు, కుటుంబ సభ్యులు ఇళ్లను శుద్ధి చేసుకుంటారు. అనంతరం జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజామందిరాలను దర్శించుకుంటారు. కాళ్లకు చెప్పులు లేకుండా ఉపవాసంతో ఉండి గుట్ట గడ్డిని సేకరించి డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చి మందిరం పైకప్పుపై వేస్తారు. మహిళలు అటవీ ప్రాంతం నుంచి పుట్ట మట్టిని సేకరించి పూజామందిరాలలోని దేవతల గద్దెలను అలుకు పూతలు చేస్తారు. రంగుల ముగ్గులు వేసి అందంగా అలంకరిస్తారు. జాతర ప్రారంభ సూచికగా తొలిపూజ జరుగుతుండటంతో బుధవారం వనదేవతల గద్దెలను దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు మేడారం తరలిరానున్నారు.



కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం

పారదర్శకతతో ఓటరు జాబితా రూపొందించాలి

ఎన్నికల ఓటర్ల జాబితా జిల్లా పరిశీలకురాలు బాల మాయాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న బాల మాయాదేవి

మహబూబాబాద్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితాను అత్యంత జాగ్రత్తతలో ప్రణాళిక బద్ధంగా, పటిష్టంగా చేపట్టాలని ఎన్నికల ఓటర్ల జాబితా జిల్లా పరిశీలకురాలు బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితాపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పటిష్టమైన ఓటర్ల జాబితాకు ప్రణాళికబద్ధంగా పారదర్శకతతో విచారణ చేపట్టి పటిష్టమైన నివేదికను రూపొందించాలన్నారు. తొలగించిన మృతుల ఓట్లు, డబుల్ ఎంట్రీ ఓట్ల తొలగింపుకు ఇంటింటి సర్వే చేపట్టడం జరిగిందని, అధికారులు వివరించగా నివేదికలో తప్పనిసరిగా పొందుపర్చాలని ఆ తర్వాత తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటుహక్కు నమోదు చేసుకున్న వారికి ఓటరు ఫొటో గుర్తింపు (ఎపిక్) కార్డులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లను అత్యధికంగా గుర్తిస్తూ నిర్దేశించిన లక్ష్యాల శాతాన్ని అధిగమించాలన్నారు. వంద సంవత్సరాలు దాటిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయి పర్యవేక్షణలో గుర్తించి నమోదు చేయాలని బాల మాయాదేవి సూచించారు. సమావేశంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, మానుకోట, తొర్రూరు ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

కళాశాల వసతి గృహంలో తనిఖీ..

జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా ఉన్న వెనుకబడిన తరగతుల బాలికల కళాశాల వసతి గృహాన్ని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థినులతో మాట్లాడి, వారికి అందుతున్న వసతులపై ఆరా తీశారు. వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. సన్నబియ్యం, కందిపప్పు వంటి ఆహార పదార్థాలను ప్రత్యక్షంగా పరిశీలించి వాటి నమూనాలను సేకరిం చారు. రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థినుల నమోదుపై అధికారులను ప్రశ్నిం చారు. నిరంతరం వసతిగృహాలను సందర్శిస్తూ నివేదికలు అందజేయా లన్నారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో అలివేలు, బీసీ అభివృద్ధి అధికారి నరసింహస్వామి, సహాయ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రగతి సాధనకు లక్ష్యంతో పని చేయాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మానుకోట సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రగతి సాధించేందుకు లక్ష్యంతో పని చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకం పనులు, పంచాయతీల్లో పన్నుల వసూళ్ల అంశాలపై మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెరగాలని సూచించారు. కూలీపనుల ప్రగతిలో వెనుకబడిన పెద్దవంగర, తొర్రూరు, మరిపెడ మండలాల ఎంపీడీవోలు లక్ష్యాలను సాధించాలని వారిని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, చర్యలు తీసుకుంటూ రోజువారి నివేదికలను అందించాలన్నారు. ఆధార్‌కు ఈకేవైసీ లింకుచేయడంలో కేసముద్రం, గార్ల మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. 20సీసీ రోడ్లు చేపట్టడం జరిగిందని త్వరితగతిన పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామ పంచాయతీలు ఇతర పన్నులతో ఇంటిపన్నుల వసూళ్లు వందశాతం సాధించాలన్నారు. ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా శానిటేషన్ పనులకు ప్రాధాన్యతనిచ్చి పల్లెల్లో కవర్లు కనిపించకుండా చర్యలు తీసుకుంటూ విక్రయించే వారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అన్నారు.

తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు రోజువారీగా వసతి గృహాలు పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీలు చేపట్టాలన్నారు. మండల పనితీరుపై ఉన్నతాధికారులు నివేదికలను ఇవ్వాలన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రధానంగా శానిటేషన్‌పై దృష్టి సారించాలన్నారు. అదే విధంగా విద్యార్థులు, గర్భిణీల్లో పౌష్టికాహారలోపాన్ని సరి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పొ, జడ్పీసీఈవో రమాదేవి, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య పాల్గొన్నారు.

'విధులను సమర్థవంతగా నిర్వహించాలి'

గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు తమ విధులను సమర్థవంతగా చేపట్టి ప్రజల మన్ననలను పొందాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జీపీ ప్రత్యేకాధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీ విధులను పారదర్శకంగా, జవాబుదారితనంగా సమర్థవంతగా నిర్వహించాలన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 14 వరకు సమ్మర్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలన్నారు. ప్రధానంతా తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని, తడిపొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వస్తువులు కన్పించకుండా సిబ్బందిని అప్రమత్తం చేయాలని, విక్రయాలు జరగకుండా తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ, జిల్లా అధికారులు రమాదేవి, సన్యాసయ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి కసరత్తు

కేటగిరి-1 వినియోగదారులకు ఉచిత విద్యుత్

- జిల్లాలో 70 శాతం మంది అర్హులు
- నేటి నుంచి మీటర్ రీడింగ్‌తో పాటు వివరాల సేకరణ
- ఎస్ఈ నరేష్

వివరాలు 8లో..

కేయూ ఎల్‌ఎల్‌బీ పరీక్షల ఫీజు గడువు 17

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సుల 3, 5, ఐదేళ్ల కోర్సుల 3,7,9 సెమిస్టర్ల పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికారెడ్డిలు మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంలో ఫిబ్రవరి 20 వరకు ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఎల్‌ఎల్‌ఎం కేయూ మూడో సెమిస్టర్ పరీక్షల ఫీజులను చెల్లించుకోవాలని అధికారులు తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్), ఎంబీఏ మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజులను ఫిబ్రవరి 17 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరు ఫీజులు చెల్లించుకోవాలని రూ.250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 20 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఇద్దరు బీటెక్ విద్యార్థులపై కత్తితో దాడి

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: హనుమకొండ పోలీసుస్టేషన్ పరిధిలోని పోచమ్మకుంట సగరకాలనీలో అద్దెకు ఉంటున్న ఇద్దరు బీటెక్ విద్యార్థులపై ఒకరు కత్తితో దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ దాడిలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన ఇదిగాని జెడ్సన్, గీసుగొండకు చెందిన కోల అరవింద్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడకు చెందిన తాటిపల్లి సుమంత్‌లు పోచమ్మకుంటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నగరంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. కాగా, వారు ఉంటున్న ఇంటి సమీపంలో మరో ఇంటిలో పాముకుంట్ల రాకేశ్ అనే విద్యార్థి అద్దెకు ఉంటున్నాడు.

ఈ క్రమంలో రాకేశ్ సోదరుడు రాజ్‌కుమార్ తమ్ముడిని చూసేందుకు సోమవారం వచ్చాడు. రాత్రి మద్యం సేవించిన తర్వాత తమ్ముడు ఉంటున్న గదిలో గట్టిగా అరవడం, అక్కడకు వచ్చిన వారిని దుర్భాషలాడి అల్లరి చిల్లర చేశాడు. ఇమేమిటని బయటకు వచ్చిన జడ్సన్, అరవింద్, సుమంత్‌లను హేళన చేస్తూ ఎందుకు వచ్చారు? చంపేస్తా..? అని బెదిరిస్తూ నానా దుర్భాషలాడాడు. భయపడి ముగ్గురు గదిలోకి వెళ్లగా వారి ఉంటున్న గదిలోకి రాజ్‌కుమార్ బలవంతంగా ప్రవేశించాడు. కూరగాయలు కోసేందుకు ఉపయోగించే కత్తితో దాడికి దిగాడు. అరవింద్‌ను కత్తితో చాతిలో గట్టిగా పొడిచాడు. అడ్డుకునేందుకు వెళ్లిన సుమంత్ చేతిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర కత్తి గాయాలు కాగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. రక్తం మడుగులో ఉన్న అరవింద్‌ను 108 సహాయంతో చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. జెడ్సన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

జనగామలో బెల్టుషాపుపై దాడులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 6: జనగామలో ఓ ఇంటిపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో రూ.6వేల విలువ గల వివిధ రకాలైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ పట్టణం వీవర్స్‌కాలనీలో ఉంటున్న రంగు నాగయ్య అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని మద్యం విక్రయిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి పెద్ద ఎత్తున మద్యాన్ని పట్టుకున్నారు. నాగయ్యను అరెస్టు చేసి విచారించారు.


మాట్లాడుతున్న ఆర్ఎం శ్రీలత

ప్రయాణికుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు



మేడారం జాతరలో 55 ఎకరాల్లో బస్టాండ్

ఈనెల 18 నుంచి నిరంతరం బస్సులు నడిపిస్తాం..

'ఆంధ్రజ్యోతి'తో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత


మేడారంలో సిద్ధం చేస్తున్న బస్టాండ్ ప్రాంగణం

హనుమకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గతంలో కన్నా ఈ సారి మరిన్ని ఎక్కువ బస్సులను నడపబోతోంది. ప్రతీసారి మేడారం జాతరకు కోటి మందికిపైగా భక్తులు తల్లుల దర్శనానికి వస్తారు. వీరిలో 20 లక్షల మందికిపైగా ఆర్టీసీ బస్సుల్లోనే వనదేవతల సన్నిధికి చేరుకుంటారు. ఈ సారి మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నందు వల్ల మహిళలు మరింత ఎక్కువ సంఖ్యలో జాతరకే రావచ్చునని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు ఏర్పాట్లను కూడా విస్తృతంగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బస్సు ప్రయాణ ఏర్పాట్లపై ఆర్టీసీ వరంగల్ రీజియన్ రీజినల్ మేనేజర్ శ్రీలత 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు. ఆ విషయాలు ఆమె మాటల్లోనే..

ఆరు వేల బస్సులు

మేడారం జాతరకు ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా 41 ఆపరేషన్ పాయింట్ల నుంచి ఆరువేల బస్సులను నడపనున్నాం. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 9 డిపోల పరిధిలో 17 పాయింట్ల నుంచి 2500 బస్సులను నడుపుతాం. 2022లో రాష్ట్రవ్యాప్తంగా 2800 బస్సులనే నడిపాం. కరోనా వల్ల భక్తుల రద్దీ లేకపోవడంతో బస్సుల సంఖ్య కూడా తగ్గింది. ఈసారి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఇంకా ఎక్కువ మంది వస్తారని అంచనా వేస్తున్నాం. ఆ మేరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రతగా బస్సుల సంఖ్యను కూడా పెంచుతున్నాం. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో మహిళలు పెద్ద సంఖ్యలో రానున్న వారి కోసం ప్రత్యేకంగా బస్సులను నడపడం అంటూ ఏమీ ఉండదు.

ఈ నెల 18 నుంచి బస్సులు

ఈనెల 18 నుంచి మేడారానికి బస్సులు క్రమంగా నడుపుతాం. ఇప్పటికే జాతరకు బస్సులు నడుపుతున్నాం. ప్రతీ రోజు 50 బస్సులు మేడారానికి వెళుతున్నాయి. ప్రతీ బుధ, ఆదివారాల్లో 79 బస్సులు వెళుతున్నాయి. జాతర ముగిసే వరకు బస్సుల నడుస్తాయి. అప్పటి వరకు అన్ని రూట్లలో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈ సారి 40లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నాం.

55 ఎకరాల్లో బస్‌స్టేషన్

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి మేడారంలో బస్‌స్టాండ్‌ను కూడా మరింత విశాలంగా ఏర్పాటు చేస్తున్నాం. ఇది వరకు 40 ఎకరాల్లో బస్‌స్టాండ్ ఏర్పాటు చేసేది. ఈ సారి అదనంగా మరో 15 ఎకరాల స్థలం అదనంగా తీసుకున్నాం. మొత్తం 55 ఎకరాల్లో బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నాము. క్యూలైన్లను కూడా పెంచుతున్నాము. ఇదివరకు బస్‌స్టాండ్‌లో 39 క్యూలైన్లు ఉండేది. ఈసారి ఈ సంఖ్యను 45కు పెంచుతున్నాం. బస్టాండ్‌లో భక్తుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా తాగునీటి కోసం రెండు ఆర్‌వోఆర్ ప్లాంట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఇందులో ఒకటి బస్‌స్టాండ్, రెండోది క్యూలైన్ల వద్ద ఉంటుంది. ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు, తగిన మార్గదర్శనం నెరిపేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా తీసుకుంటున్నాం. బస్‌స్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల కోసం 80 తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నాం.

పార్కింగ్‌కు అదనపు స్థలం

ఈ బస్సు సంఖ్య పెంచినందువల్ల పార్కింగ్ సమస్య రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. మేడారంలో బస్‌స్టాండ్‌లో 2వేల బస్సులు నిలిచేందుకు మాత్రమే స్థలం ఉంది. మిగతా బస్సుల పార్కింగ్ కోసం కామారం వద్ద 18 ఎకరాలతో అదనంగా మరో పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. బస్‌స్టాండ్‌లో బస్సులు ఖాళీ అవుతుంటే కామారంలో పార్కింగ్ చేసిన బస్సులను ఇక్కడికి పంపిస్తాం. దీనివల్ల బస్‌స్టాండ్‌లో ఒత్తిడి తగ్గుతుంది. రద్దీ సమస్య ఉండదు.

రీజియన్ నుంచి 50 శాతం సర్వీసులు

ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని మొత్తం 741 బస్సుల్లో 365 బస్సులను మేడారం స్పెషల్‌గా నడుస్తున్నాయి. మిగతావి రీజియన్ పరిధిలోనే ఆయా డిపోల పరిధిలోని జాతర బస్ పాయింట్ల వద్దకు ప్రయాణికులను చేరవేయడానికి నడుస్తాయి. జాతరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులే నడుస్తాయి. హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి సూపర్ ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సులు నడుస్తాయి.

150 కొత్త బస్సులు

జాతర కోసం ప్రస్తుతం ఉన్నవాటితో పాటు 150 కొత్త బస్సులను కూడా నడపనున్నాం. వరంగల్ రీజియన్‌కు 50 కొత్త బస్సులు వచ్చాయి. వీటితో పాటు అదనంగా మరో 100 కొత్త బస్సులను జాతరలో నడపాలని నిర్ణయించుకున్నాము. కొత్త బస్సులు ఈ నెల 18 నుంచి జాతర భక్తులకు అందుబాటులోకి వస్తాయి.

15వేల సిబ్బంది

జాతరలో బస్సుల నిర్వహణకు 15వేల మందిని నియమిస్తున్నాం. డిపో మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సెక్యూరిటీ ఆఫీసర్లు, ట్రాఫిక్ అధికారులు, మెకానిక్‌లు తదితర సిబ్బంది వీరిలో ఉంటారు. బస్సుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం.

నాలుగు చోట్ల మెకానికల్ క్యాంపులు

జాతరలో సాంకేతిక సమస్యలు తలెత్తి మార్గ మధ్యలో ఎక్కడైనా బస్సులు నిలిచిపోయిన పక్షంలో తక్షణం అక్కడకు చేరుకొని వాటికి మరమ్మతులు చేసేందుకు నాలుగు చోట్ల - మేడారం, తాడ్వాయి, పస్రా, గట్టమ్మ వద్ద మెకానికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నాం. ఒక్కొక క్యాంపులో ఆరుగురు మెకానిక్‌లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు ఉంటారు. వీరు ఎక్కడ బస్సు నిలిచిపోయినా తక్షణం అక్కడి వెళ్లి వాటిని బాగు చేస్తారు. బాగుకాకపోతే ఆ బస్సును క్రేన్ సహాయంతో పక్కన పెడతారు. పన్నెండు మొబైల్ వ్యాన్ల (డీజీబీ)ను కూడా తాడ్వాయి, నార్లాపూర్, పస్రా, గట్టమ్మ దేవాలయం, ఘనపూర్, కాటారం తదితర ప్రాంతాల్లో ప్రతీ 25 కి.మీ. ఒకటి చొప్పున అందుబాటులో ఉంటాయి. ఈ మొబైల్ వ్యాన్లను బస్సును బాగు చేయడానికి అవసరమైన విడిభాగాలు సిద్ధంగా ఉంటాయి. చెడిపోయిన బస్సుల వల్ల బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాటిని ఎత్తి పక్కన పెట్టేందుకు రెండు క్రేన్లు, ఒక ట్రాక్టర్‌ను సైతం సిద్ధంగా ఉంచుతున్నాం. ఈ మొబైల్ వ్యాన్లలో ఉన్నవారి ఫోన్లను డ్రైవర్లకు, ఇతర సిబ్బందికి ఇస్తాం. వారు ఎక్కడైనా బస్సు ఆగిపోతే వారు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగానే మొబైల్ వ్యాన్ తక్షణం అక్కడి చేరుకొని బస్సుకు మరమ్మత్తు చేస్తుంది.

వైర్‌లెస్ సెట్లు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవి సాఫీగా ముందుకు సాగేలా చర్యలు తీసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తు న్నాం. ఇందుకోసం స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నాం. 15 జీపులు, 6 మోటార్ సైకిళ్లపై వీరు తిరుగుతూ బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటారు. వైర్‌లెస్ సెట్లద్వారా సమాచారాన్ని తెలుసుకుంటారు. ప్రతీ 25 కి.మీ. మధ్య ఒక స్క్వాడ్ నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. జాతర మార్గం మొత్తాన్ని ఈ స్క్వాడ్లు కవర్ చేస్తూ ఉంటాయి.

ట్రాకింగ్ పరికరాలు

జాతర మార్గంలో బస్సుల రాకపోకలను నిరంతరం గమనించేందుకు ట్రాఫిక్ డివైస్‌లను కూడా వినియోగిస్తున్నాం. హనుమకొండ -మేడారం మధ్యలో వీటిని ఉపయోగిస్తాం. తాడ్వాయి- మేడారం మధ్య ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా పనిచేసేదానిపై వీటి వాడకం ఉంటుంది. అయితే హనుమకొండ- తాడ్వాయి మధ్య మాత్రం ఇవి పని చేస్తాయి. హనుమకొండ ఆర్ఎం కార్యాలయంలోని సెంటర్ కమాండ్ సిస్టమ్‌లో ఈ ట్రాకింగ్ డివైస్‌లు అనుసంధానం అయి ఉంటాయి. బస్సులు ఎలా నడుస్తున్నాయి? ఎంత వేగంతో నడుస్తున్నాయి? ఎక్కడైనా నిలిచిపోయాయా? ఏదైనా బస్సుకు సమస్య వచ్చిందా? అనేది కమాండ్ కంట్రోల్ రూంలోని మానిటర్ల ద్వారా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉంటాం. ఆ మేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తాం. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ అయినా ఈ మానిటర్ల ద్వారా తెలుసుకోవచ్చు.

బస్ పాయింట్లు

మేడారం వెళ్లే భక్తుల కోసం నగరంలో, అన్ని డిపో కేంద్రాల్లో 17 బస్సు పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాం. నగరంలో వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్ల వద్ద, అలాగే హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. జనగామలోని ప్రిస్టన్ స్కూల్, స్టేషన్‌ఘనపూర్, తొర్రూ రు, వర్ధన్నపేట, మహబూబాబాద్, నర్సంపేట, కొత్తగూడ, పరకాల, చిట్యాల, ఘనపూర్, భూపాలపల్లి, కాళేశ్వరం, కటారం తదితర ప్రాంతాల్లో బస్సు పాయింట్లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ ప్రయాణికులతో బస్సులు నిండగానే వెంట వెంటనే బయలుదేరుతాయి.

మేడారం ప్రధాన ద్వారం ముస్తాబు

తాడ్వాయి, ఫిబ్రవరి 6: మండలకేంద్రంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ ప్రధాన ద్వారాన్ని రంగు రంగులతో ముస్తాబు చేస్తున్నారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 21నుంచి 24వతేదీ వరకు జరిగే మహాజాతర సందర్భంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో గల మేడారం ఆర్చ్, గేటుకు రంగురంగులతో సమ్మక్క-సారలమ్మ దేవతల విగ్రహాలకు, సలహారానికి ముస్తాబు చేస్తున్నారు. ఈఏడాది అమ్మవార్లను దర్శించుకునేందుకు లక్షలాదిమంది భక్తులు తరలిరానుండడంతో ఈప్రాంతాన్ని అధికారులు శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. తాడ్వాయిలో ఎక్సైజ్, పోలీస్, ఆర్టీసీ, వైద్యఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర విభాగాల అధికారులు వారంరోజులపాటు ఉండేందుకు బస ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా లైన్లను ఏర్పాటు చేస్తున్నారు. మరో వారంరోజుల్లో ఏర్పాటుచేసిన బస కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి. ఏది ఏమైనప్పటికీ బుధవారం నుంచి మేడారం జాతర ఆరంభానికి నాంది పలుకుతుండడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తూ అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.


తాడ్వాయిలో ముస్తాబు అవుతున్న తోరణం


వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వన దేవతలకు భక్తుల మొక్కులు


మేడారం, ఫిబ్రవరి 6: మేడారం మహాజాతరకు ముందుగా తరలివస్తున్న భక్తులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం 30వేలకుపైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి గద్దెల వద్దకు చేరుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాట మొక్కులు తీర్చుకుని మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేశారు.

ములుగును సమ్మక్క సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారం, ఫిబ్రవరి 6: ములుగుకు వనదేవతలు సమ్మక్క, సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలని మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, తుడుందెబ్బ ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజాల భిక్షపతి అధ్యక్షతన మేడారంలోని హరిత హోటల్ ప్రాంగణంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లాకు వనదేవతల పేర్లను అధికారికంగా ప్రకటించాలన్నది ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. గత ఏడాది ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమ్మక్క, సారలమ్మ సన్నిధి నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారని, ఆ సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు సమ్మక్క, సారలమ్మల పేరును అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో నూతనంగా ఏర్పడిన కొన్ని జిల్లాలకు ఆయా ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాల పేర్లు పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్, ఉపాధ్యాయుల సంఘం, నగరభేరి రాష్ట్ర కార్యదర్శి పోరిక ఉదయ్ సింగ్, పలు సంఘాల నాయకులు శ్రీనివాస్, నవీన్, వేణు, చింత కృష్ణ, శ్రావణ్, కృష్ణప్రసాద్, మహేష్, రత్నం, పూజారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సందర్శించిన డీఎంహెచ్‌వో


వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో అప్పయ్య

మేడారం, ఫిబ్రవరి 6: తాడ్వాయి మండలం మేడారం మహాజాతర సందర్భంగా పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆరు వైద్య శిబిరాలను జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ అల్లెం అప్పయ్య మంగళవారం సందర్శించారు. వైద్య సేవల రికార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మంగళవారం వరకు 3,250 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. చికిత్స పొందిన భక్తుల్లో అధికంగా గొంతు నొప్పి, జలుబు, జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలతో వచ్చిన వారు ఉన్నారని అన్నారు. వారికి అవసరమైన మందులు అందించామని తెలిపారు. ఆది, బుధవారాలు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న దృష్ట్యా అనారోగ్యంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు.

'సర్వేయర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి'

కేసముద్రం, ఫిబ్రవరి 6 : కేసముద్రంలో త్వరలో ప్రారంభించే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, లేబర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ల్యాండ్ సర్వేయర్ డిపెండెంట్ ట్రైనింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకురాలు ఎఫ్సీబా తెలిపారు. మూడు నెలల కోర్సులో ఉచితంగా యూనిఫాం, స్టేషనరీ, భోజనం సదుపాయం కల్పిస్తామని, శిక్షణ అనంతరం ఉపాధి అందిస్తామని తెలిపారు. 18-35 ఏళ్ల ఇంటర్, ఐటీఐ, డిప్లొమా చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 97042 80412 నెంబరులో సంప్రదించాలని కోరారు.

సీఎంను విమర్శించే స్థాయి లేదు

● టీపీసీసీ సభ్యుడు దస్రూనాయక్

కేసముద్రం, ఫిబ్రవరి 6 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు లేదని టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్ అన్నారు. కేసముద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. దళితులకు అన్యాయం జరిగిన సమయంలో కేసీఆర్ కింద బానిస జీవిస్తూ నోరు మెదపలేదని విమర్శించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై వాడేభాష హుందాగా ఉండాలని, లేనట్లయితే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఐశ్వర్యకు తృతీయస్థానం



జాతీయస్థాయి నెట్‌బాల్‌లో తృతీయస్థానం సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

కేసముద్రం, ఫిబ్రవరి 6 : కేసముద్రం విలేజి శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌కు చెందిన గుగులోత్ ఐశ్వర్య మధ్యప్రదేశ్‌లో గతనెల 31న అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్ జాతీయ నెట్‌బాల్ ఫాస్ట్ ఫైవ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తృతీయస్థానం సాధించినట్లు కరస్పాండెంట్ చిర్రయాకాంతంగౌడ్, ప్రిన్సిపాల్ నరేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ విద్యార్థిని పాల్గొన్న టీం తృతీయస్థానం సాధించినట్లు చెప్పారు. సదరు విద్యార్థిని మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు.

'వాహనాలను తీసుకువెళ్లాలి'

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 6 : జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్‌క్లయిమ్, అన్నోన్ ప్రాపర్టీ కింద ఉన్న వాహనాలను గుర్తుపట్టిన యాజమానులు సంబంధిత పత్రాలనుచూపించి, వాహనాలను తీసుకువెళ్లాలని ఎంటీవో ఆర్ఐ సోములు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్పీ సంగ్రామ్‌సింగ్ జీ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో అన్‌క్లయిమ్డ్, అన్నోన్ ప్రాపర్టీ కింద వాహనాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో భద్రపరిచినట్లు చెప్పారు. యాజమానులు ధ్రువపత్రాలు చూపిస్తే వాటిని అందజేస్తామని చెప్పారు. పదిరోజుల గడువు తర్వాత అన్‌క్లయిమ్డ్ ప్రపర్టీ కింద పరిగణించి ఎవరికి సంబంధం లేని వాహనంగా ధ్రువీకరించి వేలం వేయడం జరుగుతుందన్నారు. అందులో రెండు బజాజ్ ఆటోలు, బజాజ్ ప్లాటిన ద్విచక్రవాహనం, టీవీఎస్ సెంట్ర, హోండా యూనికాన్, సుజికి, బజాజ్ డిస్కవర్‌లు ఉన్నాయని పేర్కొన్నారు.



బర్ల చెరువు వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

'బర్ల చెరువు భూమిని పరిరక్షించాలి'

తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 6 : వెంకటాపురం గ్రామ శివారులో ఆక్రమణకు గురైన బర్లచెరువు భూమిని పరిరక్షించాలని రైతులు కోరారు. మంగళవారం బర్లచెరువు వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు దళితరత్న గుండాల నర్సయ్య, రైతులు గుండాల యాకేందర్, యాదయ్య మాట్లాడారు. గ్రామంలోని బర్లచెరువు మత్తడి వద్ద గత దశాబ్దకాలంగా కొందరు రైతులు భూమిని ఆక్రమించుకుని, సాగు చేసుకుంటున్నట్లు ఆరోపించారు. దీంతో చెరువు నుంచి విడుదలైన నీరు చివరి ఆయకట్టున ఉన్న పంటపొలాలకు అందడంలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన భూమిని పరిరక్షించి, రైతులకు నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రైతులు వెంకన్న, వెంకటనర్సు, యాసారపు నాగార్జున్, శిలివెళ్ల శోభన్, సోమయ్య పాల్గొన్నారు.

'సీస్ పరీక్షల ఇన్విజిలేటర్లకు టీఏ, డీఏలను చెల్లించాలి'

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 6 : కేంద్రప్రభుత్వం నిర్వహించిన సీస్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించిన వారికి టీఏ, డీఏలను చెల్లించాలని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర కోకన్వీనర్ గుగులోతు భీమానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు 3, 6, 3వ తరగతి విద్యార్థులకు సీస్ పరీక్షలు నిర్వహించారని, అందులో ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించిన వారికి అన్ని జిల్లాలో టీఏ, డీఏలను అందించారని, మానుకోట జిల్లాలో ఇంత వరకు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు. తక్షణమే వారికి టీఏ, డీఏలు అందించాలని డిమాండ్ చేశారు.

ఆశా వర్కర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్

మరిపెడ, ఫిబ్రవరి 6 : ఆశా వర్కర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ.. నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మరిపెడ మండల, పట్టణానికి చెందిన ఆశావర్కర్లు సీఐటీయూ మండల కార్యదర్శి దుండి వీరన్న ఆధ్వర్యంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన జరిగే కార్మిక, కర్షకుల సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘ బాధ్యులు ఆసియాబేగం, ఉపేంద్ర, సునిత, శారద, లలిత, శైలజా, సుల్తాన్‌బేగం, భార్గవి, రమాదేవి, జ్యోతి, రేణుక, ఉమ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి కసరత్తు

- కేటగిరీ-1 వినియోగదారులకు ఉచిత కరెంట్
- జిల్లాలో 70 శాతం మంది అర్హులు
- నేటి నుంచి మీటర్ రీడింగ్‌తో పాటు వివరాల సేకరణ
- విద్యుత్ ఎస్ఈ నరేష్

తొర్రూరు, ఫిబ్రవరి 6 : జిల్లాలో కేటగిరి-1లో ఉన్న కరెంట్ వినియోగదారుల వివరాలను బుధవారం నుంచి తమ సిబ్బంది సేకరిస్తారని విద్యుత్ సీనియర్ డివిజన్ ఇంజనీర్ జె. నరేష్ తెలిపారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న గృహజ్యోతి విద్యుత్ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది వివరాలు సేకరిస్తారన్నారు. సిబ్బంది మీటర్ రీడింగ్ సమయంలో 200ల యూనిట్ల కంటే తక్కువగా విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారుల నుంచి ఆధారాలు సేకరించాలని ఆదేశించారు. ప్రాథమికంగా తక్కువ కరెంట్ వినియోగించే తెలుపు రేషన్ కార్డు పరిధిలోని గృహ వినియోగదారుల ఆధార్, రేషన్‌కార్డు, మీటర్ రీడింగ్‌ను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారుల వివ



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

రాలు కరెంట్ వినియోగంలో కేటగిరి-1లో ఉన్న వినియోగదారులకు ఉచిత విద్యుత్ అందించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించడంతో జిల్లాలో ఆ కేటగిరీలో ఉన్న వినియోగదారుల జాబితాను తయారు చేసేందుకు విద్యుత్‌శాఖ సిద్ధమవుతోందన్నారు. వినియోగదారుల స్థాయిని బట్టి వినియోగదారులను 9 కేటగిరీలుగా విభజించడం జరిగిందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో కేటగిరి-1లో 2,09,479 గృహ వినియోగదారులు కేటగిరి-2లో 21,757 మంది నాన్‌డొమాస్టిక్ వినియోగదారులు, కేటగిరి-3లో 3,265 పరిశ్రమ వినియోగదారులు, కేటగిరి-4లో 362 పరిశ్రమలు, కేటగిరి-5లో 90, 268, వ్యవసాయ వినియోగదారులు కేటగిరి-6లో 3,092 మంది, వీధి వ్యాపారులు కేటగిరి-7లో 1,570 ఇండస్ట్రీస్, కేటగిరి-8లో 845 మంది వినియోగదారులు, కేటగిరి-9లో ఒక విద్యుత్ బంక్‌లతో జిల్లాలో మొత్తం 3,29,267 కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. జిల్లాలో 70 శాతం మంది గృహ వినియోగదారులకు లబ్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. సిబ్బంది వివరాల సేకరణలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ మధుసూదన్, ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టబద్ధంగానే పిల్లలను దత్తత తీసుకోవాలి

● బాలల సంరక్షణ అధికారి నరేష్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 7 : చట్టబద్ధత ద్వారా దత్తత తీసుకోవడం వల్ల మాత్రమే పిల్లలకు పూర్తి హక్కులు వరిస్తాయని, మాతృత్వం లేనివారికి దత్తత మరో మార్గమని బాలలసంరక్షణ అధికారి నరేష్ అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు మంగళవారం చట్టబద్ధతమైన దత్తత గురించి అవగాహన కల్పించి, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా దత్తత తీసుకుంటే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చట్టబద్ధత ప్రకారం దత్తత తీసుకోవాలనుకుంటే దంపతులు cara.wcd.gov.in



ఆశా వర్కర్లకు దత్తత గురించి అవగాహన కల్పిస్తున్న నరేష్

వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్టర్ చేసుకున్న వారి ఇంటిని అధికారులు సందర్శించి పూర్తి వివరాలు సేకరించిన తర్వాతనే వారికి పిల్లలను దత్తత ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం దత్తత తీసుకోవాలని సూచించారు. డాక్టర్ సుధీర్, రమేష్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తాం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

ఇనుగుర్తి, ఫిబ్రవరి 6 : పేద ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందని, ప్రతీ అర్హుడైన పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తామని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం ప్రజా సమస్యలపై పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్ననాగారం, కోమటిపల్లి గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకంలో భాగంగా ఆరు గ్యారెంటీ సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికి అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సతీష్, బైరు అశోక్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న మురళీనాయక్

'సురక్షిత గ్రామం కోసం ప్రజలు కృషి చేయాలి'

కొత్తగూడ, ఫిబ్రవరి 6 : ఏ సమస్యలు లేని సురక్షిత గ్రామం కోసం ఊరిలోని అన్నివర్గాల ప్రజలు కృషి చేయాలని ఎఫ్ఎంఎం సంస్థ వలంటీర్ బెజ్జంకి ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని బొత్తవాని గూడెంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ, మైచాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మం గళవారం సురక్షిత గ్రామం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బాల్యవివాహాలు జరుగకుండా, బాలలపై లైంగిక వేధింపులు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. బాలకార్మికులు లేకుండా చూడాలన్నారు. బాలల అక్రమ రవాణా జరుగకుండా పర్యవేక్షించాలన్నారు. గృహలలో గృహహింస జరుగకుండా చూడాలన్నారు, మండలంలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువజన సంఘాలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామప్రజలు కలిసికట్టుగా ఆదర్శ సురక్షిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త, గ్రామ పంచాయతీ సిబ్బందికి బుక్‌లెట్స్ పంపిణీ చేశారు.



బొత్తవానిగూడెంలో బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న ప్రభాకర్

నష్టపరిహారం చెల్లించాలని రైతుల రాస్తారోకో

నెల్లికుదురు, ఫిబ్రవరి 6 : నేషనల్ గ్రీన్ ఫీల్డ్‌హైవేతో విలువైన భూములు కోల్పోతున్నామని ఆలేరు, నర్సింహులగూడెం, చిన్నముప్పారం రైతులు మంగళవారం నెల్లికుదురు-మానుకోట ప్రధాన రహదారిపైరాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా రైతులు రూపిరెడ్డి గోపాల్‌రెడ్డి శ్రీను, మాట్లాడారు. ఇప్పటికైనా మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు కాలేరు రమేష్, రాములు సురేష్, నరేష్, మడిపెల్లి శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

మునిసిపాలిటీని బదనాం చేయొద్దు

● చైర్మన్ వాంకుడోతు వీరన్న

డోర్నకల్, ఫిబ్రవరి 6 : మునిసిపాలిటీలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం జరిగిందని.. లేనిపోని విమర్శలు చేస్తూ మునిసిపాలిటీని బదనాం చేయొద్దని డోర్నకల్‌మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల తో మాట్లాడారు. నిధుల దుర్వినియోగం అనేది ఉట్టిమాటేనని, దీనివెనుక కొందరు కావాలనే మునిసిపాలిటీ పాలకవర్గాన్ని బదనం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు అనవసరమైన ఆరోపణలు చేసి మునిసిపాలిటీ పరువు తీయొద్దన్నారు. డోర్నకల్ మునిసిపాలిటీలో రూ.50 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ కాంగ్రెస్ నాయకులు సోమవారం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త వీరన్న, అజిత్‌మియా, శంకర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు అధిక లాభాలు

● ఉద్యాన అధికారి సూర్యనారాయణ

కురవి, ఫిబ్రవరి 6 : తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే ఆయిల్‌పామ్ తోటలను రైతులందరూ సాగు చేయాలని పట్టుపరిశ్రమ, ఉద్యానవన అధికారి కె.సూర్యనారాయణ అన్నారు. కురవిలోని మేక నాగిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం ఆయిల్‌పామ్ తోటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తున్న రైతులంతా మొక్కలకు కావాల్సిన నీరు, ఎరువులను అందించాలన్నారు. యాజమాన్య, సస్యరక్షణ చర్యలు పూర్తిగా అర్థమయ్యేట్లుగా రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త కె.రాంబాబు మాట్లాడుతూ మామిడి రైతులు తోటలు తెల్లపూత దశలో ఎటువంటి మందులు పిచికారి చేయొద్దని సూచించారు. ఉద్యానవన అధికారి అనితశ్రీ, రైతులు మేక నాగిరెడ్డి, బండి శ్రీనివాస్, నంజాల ప్రభాకర్, సంగెం వీరభద్రం, కానుగంటి బాబు పాల్గొన్నారు.

'సీఎంకు బహిరంగ క్షమాపణ చెప్పాలి'



సుమన్‌తో ఉన్న ఫ్లెక్సీని చెప్పుతో కొడుతున్న కాంగ్రెస్ నాయకులు

తొర్రూరు, ఫిబ్రవరి6 : సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ అన్నారు. మంగళవారం తొర్రూరులోని గాంధీ సెంటర్‌లో సుమన్ ఫ్లెక్సీకి చెప్పుల దండావేసి చెప్పులతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం దారుణమని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దాడులు తప్పవని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, ఎంపీటీసీ విక్రమ్ రెడ్డి, నాయకులు రోజా ప్రభుదాస్, రాము, గజానంద్, అచ్చిరెడ్డి, నాగయ్య, మధు, వెంకన్న, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సమ్మెను జయప్రదం చేయండి'

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 6 : ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ట్యాక్సీ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నం నాగరాజు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో మంగవారం సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ హిట్అండ్‌రన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, 2019 ఎంవీఐ చట్టాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, ఎమ్డీ. షాజహాన్, శ్రీను, నారాయణ, నరేష్ పాల్గొన్నారు.



జనరల్ ఆస్పత్రిలో పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు మెడికల్ పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు మెడికల్ పరీక్షలు

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 6 : ఇటీవల పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న పోలీస్ రిక్రూట్‌మెంట్ అభ్యర్థులకు మంగళవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలను నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారి అంబరీష తెలిపారు. ఈ సందర్భంగా అంబరీష మాట్లాడుతూ పోలీస్ రిక్రూట్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మెడికల్ పరీక్షల్లో కంటి పరీక్ష, దూర దృష్టి, దగ్గర దృష్టి, కలర్ విజన్ పరీక్షలతో పాటు జనరల్ హెల్త్ చెకప్, రక్త పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, కృష్ణార్జున్‌రావు, వడ్డెబోయిన శ్రీనివాస్, సుబ్బలక్ష్మి, కృష్ణ, కేవీ.రాజు, విఘ్నేష్, శ్రీధర్, రుక్మోద్దీన్ పాల్గొన్నారు.

సేవాలాల్ మహిళ సేన జిల్లా ఉపాధ్యక్షురాలిగా పూజ



నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 6 : సేవాలాల్ మహిళ సేన జిల్లా ఉపాధ్యక్షురాలుగా బానోత్ పూజను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు భూక్య స్రవంతి మంగళవారం తెలిపారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బాబునాయక్ తండాకు చెందిన పూజ సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో లంబాడీల కోసం జరిగిన ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. ఆమె సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగిం చినట్లు స్రవంతి పేర్కొన్నారు.

'ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టును విద్యార్థులు వినియోగించుకోవాలి'

కురవి, ఫిబ్రవరి 6 : పదో తరగతి విద్యార్థుల్లో భయాందోళనలు పోగొట్టి, ప్రతిభ వెలికి తీసేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించే టాలెంట్‌టెస్ట్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు అన్నారు. నేరడ, కురవి, మోద్గులగూడెం, సీరోలు, కాంపెల్లి పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ టాలెంట్‌టెస్ట్ కరపత్రాలను విడుదల చేసి విద్యార్థులకు టాలెంట్‌టెస్‌పై వివరించారు. నాయకులు గంధసిరి జ్యోతిబసు, వీరేందర్, మహేష్, వినయ్, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు.

ఎంపీ సీటు బంజారాలకే కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

డోర్నకల్, ఫిబ్రవరి 6 : మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండు లక్షల 10 వేల మందికిపైగా లంబాడ గిరిజన ఓటర్లు ఉన్నందున మహబూబాబాద్ లోక్‌సభ సీటును బంజారాలకే కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నూనావత్ శంకర్‌నాయక్ అన్నారు. డోర్నకల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీ సీటుకు పోటీ చేసేందుకు తనకు అన్ని అర్హతలు ఉన్నాయని, తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నానని అన్నారు. ఇల్లందు, కొత్తగూడెం, నర్సంపేట, ములుగు, నియోజకవర్గాల ప్రజలతో తనకు విస్తృత పరిచయాలు ఉన్నాయన్నారు. వైద్యుడిగా ఉంటూ పేద ప్రజలకు ఉత్తమ సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సింగరేణి కార్మికుల సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన ఉందన్నారు.

'ప్లాస్టిక్, కోళ్ల వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయొద్దు'



మాట్లాడుతున్న మునిసిపల్ ఏఈ బాబు

డోర్నకల్, ఫిబ్రవరి 6 : డోర్నకల్ మునిసిపల్ పరిధిలో చేపలు, మాంసం విక్రయిస్తున్న వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ వాటి వ్యర్థాలను వేయొద్దని మునిసిపల్ ఏఈ బాబు మంగళవారం హెచ్చరించారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో మంగళవారం మాంసం విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయడం ద్వారాపరిసరాలు కలుషితమవుతున్నాయని, దీంతో ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా వ్యర్థాలను డంపింగ్ యార్డు వద్ద నిర్దేంచిన ప్రదేశంలో వేయాలని సూచించారు. అదే విధంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ అహ్మద్, నాగరాజు పాల్గొన్నారు.

సునీల్‌కు పలువురి పరామర్శ



అయ్యగారిపల్లిలో మేక సంజీవరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

కురవి, ఫిబ్రవరి 6 : పితృవియోగానికి గురైన రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల సలహాదారు, నల్సార్ లాయూనివర్సిటీ ప్రొఫెసర్ మేక సునినిల్ రెడ్డిని పలువురు ప్రముఖులు మంగళవారం పరామర్శించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో సునీల్‌రెడ్డి తండ్రి మేక సంజీవరెడ్డి (70) గుండెపోటుతో మృతి చెందగా, మృతదేహాన్ని స్వగ్రామమైన కురవి మండలం అయ్యగారిపల్లికి తరలించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అయ్యగారిపల్లికి చేరుకుని సంజీవరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. సంజీవరెడ్డి కుమారులు సునిల్ రెడ్డి, సందీప్‌ను ఓదార్చారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ ప్రభుత్వ ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి, సభ్యుడు లచ్చిరెడ్డి, జడ్పీటీసీ బండి వెంకట్‌రెడ్డి సంజీవరెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పించి సునీల్‌రెడ్డిని పరామర్శించారు. అనంతరం అయ్యగారిపల్లిలో సంజీవరెడ్డి అంతిమయాత్రను నిర్వహించారు. నల్సార్ లాయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కృష్ణదేవరావు, బజ్జూరి పిచ్చిరెడ్డి, బండి లక్ష్మారెడ్డి, తోట లాలయ్య, తవనం సుఖేందర్ రెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, బజ్జూరి వెంకట్‌రెడ్డి, మేక దామోదర్‌రెడ్డి, దొంగల జనార్థన్‌రెడ్డి పాల్గొన్నారు.



మేక సంజీవరెడ్డి (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

డోర్నకల్, ఫిబ్రవరి 6 : మండలంలోని జోగ్యాతండాకు చెందిన అంగోత్ సేవ్య (48) అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. తండవాసులు తెలిపిన ప్రకారం. సేవ్యకు కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేదు. ఈ క్రమంలో భార్యతో తరచు గొడవపడుతుండేవాడు. ఉదయం ఆమెపై చేయి చేసుకున్నాడు. వారి కుమారుడు అంగోత్ కుమార్ ఇంటికి రాగా, కుమారున్ని చూసిన సేవ్య బయటకు వెళుతూ ఇంటి ముందుజారి రాయిపై పడడంతో తలవెనుకవైపున బలమైన గాయమైంది. ఆయన్ను కుమారుడు, బంధువుల కలిసి ఖమ్మంకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. విషయం తెలిసిన ఎస్సైలు ఝాన్సీ, సంతోష్‌రావు తండాకు చేరుకొని విచారణ చేపట్టారు.